కథ

# ఆగంతకుడు

—ముద్దంశెట్టి హనుమంతరావు

ఉదయ్ గుమ్మం ముందు నిల్చుని కాలింగ్ బెల్ నొక్కాడు. ఎవరూ వచ్చి తలుపు తీయలేదు. లోపల్నుంచి ఎవరి గొంతూ వినిపించలేదు. మళ్ళీ కాలింగ్ బెల్ నొక్కాడు. అబ్బే: ఇప్పుడూ ఎవరూ రాలేదు. అతనికేం అర్థం కాలేదు. తప్పనిసరై గట్టిగా తలుపు కొట్టాడు. ఈసారి మాత్రం తలుపు తెరుచుకుంది.



ముప్ఫయ్ సంవత్సరాల లోపే వయసున్న యువకుడు ఆవలించుకుంటూ ఎదురుగా నిల్చున్నాడు. అతని పేరు ధన్‌రాజ్.

"ఎవరు కావాలండీ!" ఉదయ్‌ని ప్రశ్నించాడు ధన్‌రాజ్.

ఉదయ్ అతనికేసి పరికించాడు. అతణ్ణి ఇంతకు ముందు చూళ్ళేదు. అందుకే పరిచయం లేదు.

'మీరు నిద్రపోతున్నారల్లే వుంది. అందుకే కాలింగ్ బెల్ రెండుసార్లు కొట్టినా తలువు తీయలేదు. అందుకే గట్టిగా తలువు తట్టాను" చెప్పాడు ఉదయ్.

"నిక్షేపం లాంటి నిద్ర చెడింది కదండీ! ఇంతకీ మీరు ఎవరికోసం వచ్చారు?" ఆవలిస్తూనే అడిగాడు ధన్‌రాజ్.

"నేను అమెరికా నుంచి వచ్చానండీ! ముకుందం మామయ్య, శారదత్తయ్యా..వీళ్ళంతా ఏరండీ?"

ధన్‌రాజ్ ఉదయ్‌కేసి పరికించి చూశాడు. బస్సు ప్రయాణంలో బాగా అలసట చెంది వున్నాడేమో, ఉదయ్ మొహం జిడ్డుబారి వుంది. అమెరికా నుంచి వచ్చినవాళ్ళు ఇలాగే వుంటారా?..అన్న అనుమానం వచ్చింది ధన్‌రాజ్‌కి.

"ముకుందం గారికి మీరు బంధువులా?" ప్రశ్నించాడు ధన్‌రాజ్.

"ఔనండీ!"

ధన్‌రాజ్ గట్టిగా నవ్వాడు.

"చెవిలో పువ్వు పెట్టడానికి. నేనే దొరికానటండీ! ముకుందం గారి బంధువులందరూ నాకు తెలుసు. మిమ్మల్ని నేనెప్పుడూ చూళ్ళేదే!" సందేహంగా అన్నాడు.

ఉదయ్ సహనాన్ని కోల్పోతున్నాడు. అతని మొహంలో స్వల్పంగా విసుగు ద్యోతకమవుతోంది.

"మీతో గొప్ప చిక్కే వచ్చిపడిందండీ! ఇంతకీ మీరు ముకుందం గారికి ఏమౌతారండీ?" మరింక ఓపిక లేనివాడిలా ప్రశ్నించాడు ఉదయ్.

"సాక్షాత్తూ వారి అల్లుణ్ణండీ!" దర్పంగా చెప్పాడు ధన్‌రాజ్.

కాస్తంత రిలీఫ్ వచ్చినట్టుగా ఉదయ్ ఓ నిశ్వాసం వదిలాడు.

"అంటే శాంతి భర్తగారన్నమాట!" మందహాసంతో అన్నాడు ఉదయ్.

"అన్నమాటేమిటండీ బాబూ! ఉన్నమాటే. శాంతి మీకెట్లా తెలుసునండీ!" అతనిపై కాస్తంత నమ్మకం ఏర్పడి నెమ్మదిగా ప్రశ్నించాడు.

ఉదయ్ సన్నగా నవ్వేడు.

"మంచివారేనండీ! ముకుందం గారు ఎవరో కాదు. మా మేనత్త కొడుకే! అట్లాంటప్పుడు ఆయన కూతురు శాంతి తెలియకుండా వుంటుందా? మీ వివాహ ఆహ్వాన పత్రిక నాకు అమెరికాకు అందిందండీ! అయితే ఆ సమయానికి కొన్ని కారణాల వల్ల రాలేకపోయాను. గ్రీటింగ్స్ పంపించాను".

ధన్‌రాజ్‌కి ఇప్పుడు ఉదయ్ పట్ల ఇప్పుడు బాగా నమ్మకం కుదిరింది. అతని మొహంలో ఆనందం వెల్లివిరిసింది.

"ఓ అలాగా! మిమ్మల్ని నా ప్రశ్నలతో విసిగించాను. క్షమించండి. మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకెంతో ఆనందంగా వుందండీ. రండి లోపలికి" అంటూ ఆహ్వానించాడు ధన్‌రాజ్ అతనితో చేయి కలుపుతూ.

"ఇట్సాల్‌రైట్.." లోపలికి వచ్చి సోఫాలో ఆసీనుడయ్యాడు ఉదయ్.

"ఇప్పటికైనా నమ్మారు. సంతోషం. ఔనూ, వీళ్ళంతా ఎక్కడికి వెళ్ళారండీ?"

'గుడికి వెళ్ళారండీ! కాస్సేపట్లో వచ్చేస్తారు" అన్నాడు ధన్‌రాజ్.

"సరే బస్సు ప్రయాణంలో రోడ్డు మీద ధూళంతా నా మొహం మీదే వున్నట్టుంది. లోపలికి వెళ్ళి ఫ్రెష్ అయి వస్తానుండండి" అంటూ చేతిలోని సూట్‌కేసుతో పాటు లోపలికి వెళ్ళిపోయాడు ఉదయ్.

ధన్‌రాజ్ తనలో నవ్వుకున్నాడు జరిగినదానికి.

అప్పుడే శారద, శాంతి బైటనుంచి వచ్చారు. ఇంటి తలువులు తీసే వుండటం వారికి కంగారు కలిగించింది.

"తలువు అట్లా తీసే వుంచారేమిటండీ! లోపల గడియ వేసుకుని వుండమని మరీమరీ చెప్పి వెళ్ళాం కదా!"విసుగ్గానే అంది శాంతి భర్తనుద్దేశించి.

"లోపల గడియ వేసుకుని వుంటే ఎట్లా శాంతీ? ఎవరో మీ బంధువట!వచ్చాడు" తొణక్కుండా చెప్పాడు ధన్‌రాజ్.

"మా బంధువా! ఎవరల్లుడు గారూ? పేరేంటి?" ఈసారి శారద ప్రశ్నించింది ఆశ్చర్యంగా.

"పేరు తెలుసుకోలేదత్తయ్యా!"

"ఏడి అతను?"

"లోపలికి వెళ్ళాడు మొహం కడుక్కోవడానికి. బస్సులో వచ్చాడు కదా!" అన్నాడు ధన్‌రాజ్.

శాంతి మొహంలో రంగులు మారాయి.

"పేరు వివరాలు తెలుసుకోకుండా అతణ్ణి లోపలికి ఎందుకు రానిచ్చారండీ?" కోపంగానే ప్రశ్నించింది శాంతి.

శారద అంతరంగంలో ఏదో అనుమానం మొలకెత్తింది.

"బంధువని చెప్పి ఎవడో దొంగవెధవ లోపలికి వెళ్ళాడేమో శాంతీ! అమ్మో..అమ్మో..లోపల వాడేం చక్కబెట్టుకుంటున్నాడో ఏమో!" కంగారుగా వాపోయింది శారద.

ఇంతలోనే ముకుందం బయట నుంచి వచ్చాడు.

"ఈ ఆటో వాళ్ళతో ఇదే ఇబ్బంది శారదా. ఎప్పుడూ వాళ్ళ దగ్గర చిల్లరుండదు" విసుగ్గా అన్నాడు ముకుందం.

"అబ్బ వుండండీ! కొంప మునిగిందిక్కడ" ఆందోళనగా అంది శారద.

"ఏమయ్యింది శారదా!" అయోమయంగా భార్యకేసి చూస్తూ అన్నాడు.

"ఎవడో దొంగవెధవ, మన బంధువని అల్లుడిగారిని నమ్మించి మొహం కడుక్కునేందుకు లోపలికి వెళ్ళాడటండీ!" ఆతృతతో చెప్పింది శారద.

శాంతి మొహం వివర్ణమైంది. తన భర్త చేసిన నిర్వాకానికి ఆమె సిగ్గుపడుతోంది. ఒక పక్క కోపంతో ఆమె కళ్ళు ఎర్రగా మారుతున్నాయి.

ముకుందం మొహంలో ఆతృత, భయం చోటు చేసుకునన్నాయి.

"ఎవడో దొంగ వెధవ మా బంధువని చెప్పి వస్తే

అతణ్ణి మీరెలా లోపలికి వెళ్ళనిచ్చారు అల్లుడు గారూ! ఇటువంటి దొంగతనాలు ఎన్ని జరగడం లేదు? అతను లోపలికి వెళ్ళినప్పుడు అతనితో పాటు, మీరూ వెళ్ళొచ్చు కదా?" విసుగ్గా చిరుకోపంతో అన్నాడు ముకుందం.

"మొహం కడుక్కుని ఫ్రెషప్పయి వస్తానని వెళ్ళాడు మావగారూ! అప్పుడు అతనితో పాటు నేనెందుకండీ?" తనని తాను సమర్థించుకున్నాడు ధన్ రాజ్.

'ఆ దొంగ వెధవకి ఫ్రెషప్పవడం ఒకటా? ఎంత ధైర్యం వాడికి? ఈలోగా వాడు లోపల బీరువాలు తెరిచి బంగారం, డబ్బు, దస్కం సర్దుకుపోతేనో... అయ్య బాబోయ్, ఇప్పుడేం చేయడం?" ఆరాటంగా అన్నాడు ముకుందం.

"అమ్మా! నా రవ్వల నెక్లెస్ పెద్ద బీరువాలోనే వుంచేశానే!!" అంది శాంతి దాదాపు ఏడుస్తూ.

ఇంకా ఉపేక్షిస్తే లాభంలేదనుకున్నాడు ముకుందం.

"ఇలా మాట్లాడుతూ కూచుంటే లాభం లేదు శారదా! నేనే లోపలికి వెళ్ళి వాణ్ణి పట్టుకుంటా నుండు" అంటూ లోపలికి వెళ్ళడానికి ఉద్యుక్తుడ య్యాడు ముకుందం.

కంగారుగా శారద అడ్డుపడింది. ఆమె కళ్ళల్లో ఏదో భయం.

"వద్దండీ! మీరు వెళ్ళొద్దు. ఆ దొంగ వెధవ దగ్గర ఏ కత్తో, పిస్తోలో...ఏదో ఒకటి వుండకపోదు. మీకు ఏ అపకారం చేసినా చేయవచ్చు" అంది శారద.

ముకుందం అదోలా మొహం పెట్టాడు.

"అలాగని వూరుకుంటే ఎట్లా శారదా! బంగారూ, డబ్బూ పట్టుకుపోతేనో?" నిస్సహాయంగా అన్నాడు ముకుందం.

లోపలికి వెళ్ళినవాడు తప్పకుండా దొంగే అయ్యుంటాడన్న అనుమానం ధన్‌రాజ్‌కి ధృవపడింది. తనని తెలివిగా మోసం చేసి ఇంట్లోకి వచ్చినవాణ్ణి వదిలేయకూడదనుకున్నాడు. అతనిలోని పౌరుషం పరాకాష్టకు చేరుకుంది.

"ఆ దొంగ వెధవ భరతం నేను పడతాను మావగారూ! మాటల గారడీతో నన్ను బురిడీ కొట్టించి ఇంట్లో ప్రవేశిస్తాడా? ఈ ధన్‌రాజ్ సంగతి వాడికి తెలీదు. పెడ రెక్కలు విరిచి కట్టి వాణ్ణి తీసుకొస్తానుండండి" అంటూ తను లోపలికి వెళ్ళడానికి తయారయ్యాడు ధన్‌రాజ్.

ఎవరి మంగళసూత్రం వారికే విలువైంది మరి. శాంతి మెరుపు వేగంతో భర్తకి అడ్డొచ్చింది.

"మంచి వారండీ! మా అమ్మ అన్నట్టు ఆ దొంగ వెధవ దగ్గర పిస్తోలో, కత్తో వుంటే, మీరు మాత్రం వాణ్ణి ఏం చేయగలరండీ? నూతన దంపతులం మనం. మీకు ఏమైనా అయితే నేను తట్టుకోలేనండీ! మీరు వెళ్ళొద్దు" రుద్ధ స్వరంతో అంది శాంతి.

"ఎవరూ వెళ్ళకపోతే ఆ దొంగ వచ్చినోడు ఇంటిని గుల్ల చేసి అలా పెరట్లోనుంచి పారిపోతాడమ్మా! అసలు ఆ విషయం తల్చుకుంటేనే భయంగా వుంది, అలా జరగడానికి వీల్లేదు. నేనే వెళ్తాను. ఏమైతే అయ్యింది. నన్ను ఎవ్వరూ ఆపకండి!" కోపంగా అంటూ లోపలికి విసురుగా వెళ్ళబోయిన ముకుందని అతని భార్య శారద మళ్ళీ అడ్డుకుంది. అయినా ముకుందం భార్య చేతుల్ని విదిలించుకుంటూ వెళ్ళబోయాడు లోపలి గదిలోకి.

అదిగో – అప్పుడొచ్చాడు లోపల్నించి ఉదయ్ చేతిలో సూట్‌కేసుతో. ఫ్రెష్‌గా వున్నాడు.

"హల్లో మామయ్యా"అన్నాడు నవ్వుతూ.

ముకుందం, శారద, శాంతి ఆశ్చర్యంగా ఉదయ్ కేసి చూస్తూ లిప్తపాటు అచేతనంగా వుండిపోయారు. ఎవరినోటా మాట రాలేదు.

వాళ్ళు అలా తెల్లమొహాలు వేయడం, ఉదయ్‌కి అర్థం కాలేదు.

"అదేమిటి మామయ్యా! ఎవరో ఆగంతకుణ్ణి చూస్తున్నట్టు వింతగా చూస్తున్నారేమిటి? నేనూ.. ఉదయ్‌ని.. అమెరికా నుంచి వచ్చాను" అన్నాడు మందహాసంతో.

"ఒరేయ్ ఉదయ్. నిన్ను చప్పున గుర్తుపట్టలేకపోయాను. నీలో ఎంత మార్పు వచ్చిందని? ఆశ్చర్యం నుంచి తేరుకుని అన్నాడు ముకుందం.

'నిజమే బావా! గుర్తుపట్టలేనంతగా నీలో మార్పు వచ్చింది సుమా!" అంది శాంతి చిరునవ్వుతో.

శారద మెల్లగా నవ్వింది.

"అయినా ఇలా ఉత్తరం, ఫోనూ లేకుండా ఊడిపడ్డావేమిటిరా! తేరుకుంటూ అన్నాడు ముకుందం".

"మిమ్మల్ని సర్ప్రయిజ్ చేద్దామని".

"ఏమి సర్ప్రయిజో! ఏమిటో మేమంతా ఎంత కంగారు పడ్డామో ఎవరో దొంగ ఇంట్లో దూరాడని" అన్నాడు ముకుందం.

"ఔను ఉదయ్. చూడగానే నిన్ను గుర్తుపట్టలేకపోయాం. నిజం. మా అల్లుడు ఎవరో వ్యక్తి మా బంధువని చెప్పి లోపలికి వెళ్ళాడని చెప్పగానే ఎవరో దొంగ అయ్యుంటాడనుకున్నాం గానీ నువ్వు గుర్తుకు రాలేదు. అటువంటి దొంగతనాలూ జరుగుతూ వున్నాయి కదా!' నవ్వుతూనే అంది శారద.

ఉదయ్ పగలబడి నవ్వేడు.

"అయితే నన్ను 'దొంగ'గా ముద్ర వేశారన్న మాట. ఫెంటాస్టిక్!" అన్నాడు బిగ్గరగా నవ్వుతూ ఉదయ్.

ఉదయ్ నవ్వుతో అందరూ నవ్వులు మేళవించారు.


సదరన్ ట్రావెల్స్ (ప్రై) లిమిటెడ్

ట్రావెల్ అండ్ టూర్ ఆపరేటర్స్

(భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖచే గుర్తింపుపొందిన సంస్థ)

**స్వర్ణాంధ్ర యాత్రలు**

దేశంలోని ప్రధాన నగరాలలో కార్యాలయాలను కలిగి జాతీయస్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి టూర్స్ మరియు ట్రావెల్స్ రంగంలో ఖ్యాతిగాంచిన సదరన్ ట్రావెల్స్ వారి సూపర్ డీలక్స్ మరియు హైటెక్ కోచ్‌లలో యాత్రలు.

**మా హైదరాబాద్ ఆఫీస నుండి**

1. హైదరాబాద్ నగర దర్శిని — ప్రతిరోజూ రూ.75/-
2. హైదరాబాద్–షిర్డి–తపోభూమి–ఎల్లోరా గుహలు–గృష్ణేశ్వర్ (జ్యోతిర్లింగం)–ఔరంగాబాద్ – హైదరాబాద్(మూడు రోజులు) — ప్రతిరోజూ రూ.625/-

**మా విశాఖపట్నం ఆఫీసు నుండి**

3. విశాఖపట్నం దర్శిని — ప్రతిరోజూ రూ.75/-
4. విశాఖపట్నం–అరకులోయలు–బొర్రా గుహలు–విశాఖపట్నం — ప్రతిరోజూ రూ.185/-
(మధ్యాహ్నం భోజనం మరియు టీతో)

**NOTE:** స్కూల్స్, కాలేజీలు మరియు కంపెనీ గ్రూప్‌లకు ప్రత్యేక ప్యాకేజి టూర్స్ కలవు.

మిగిలిన వివరాలకు మా ఆఫీసులు సంప్రదించండి:

హైదరాబాద్: హోటల్ అయోధ్య కాంప్లెక్స్, లకడీకాపూల్. ఫోన్: 3307933, 3307658

వైజాగ్: ఎ-5, పవన్ పాలెస్, T.S.R. కాంప్లెక్స్ ఎదురుగా, ద్వారకానగర్. ఫోన్: 545565, 541099

విజయవాడ: నెం. 10, స్వర్ణలోక్ కాంప్లెక్స్, అప్సర థియేటర్ దగ్గర, గవర్నర్‌పేట. ఫోన్స్: 572227, 576624

✆: న్యూఢిల్లీ: 5739508, చెన్నై: 564864, బెంగుళూరు: 2262633, ముంబాయి: 4326895